క్లుప్తంగా

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లిని బుధవారం ఆలయ కమిటీ ప్రతినిధులు బంతి, చామంతి, తులసి మాలలు, నిమ్మ దండలతో అలంకరించారు. అమ్మవారిని చిప్పాడ నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేషనల్ సెమినార్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రజని

కొమ్మాది: బీచ్ రోడ్డు రుషికొండలో గల గాయత్రి విద్యా పరిషత్ కాలేజీలో వచ్చేనెల 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న నేషనల్ సెమినార్, ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ రజని ఆవిష్కరించారు. ఈ రెండు రోజులు ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీర్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ జ్యోష్న, ప్రొఫెసర్ మానస తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి చిన్న ఉప్పాడ ప్రాంతంలో రూ.22లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి బుధవారం వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు శంకుస్థాపన చేశారు. 30 రోజుల్లోనే వీటి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గీతంలో బట్నాగర్ జయంతి వేడుకలు

కొమ్మాది: రుషికొండలో గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సర్ శాంతి స్వరూప్ బట్నాగర్ 130వ జయంతి వేడుకలను నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్ కృష్ణ బట్నాగర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో అభివృద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ బట్నాగర్ వంటి పరిశోధకుల దూర దృష్టి కారణమన్నారు.

బ్యాంకింగ్ సేవలపై విస్తృత ప్రచారం



తగరపువలసలో పాదయాత్ర చేస్తున్న ఎస్‌బీఐ చిట్టివలస బ్రాంచ్ సిబ్బంది

తగరపువలస: బ్యాంకింగ్ రంగంలో అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించేందుకు బుధవారం చిట్టివలస ఎస్‌బీఐ బ్రాంచ్ సిబ్బంది తగరపువలస వీధుల్లో పాదయాత్ర చేశారు. బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముద్ర రుణాలు, స్టాండప్ రుణాలు, క్యూ ఆర్ కోడ్, పీవోఎస్ యంత్రాలు, కరెంట్, సేవింగ్ డిపాజిట్లు, చిన్న,మధ్య తరహా రుణాల గురించి ప్రచారం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో పద్మనాభం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణరావు

పద్మనాభం: ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హయాంలో ఈ ఐదేళ్లలో పద్మనాభం మండలంలో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ మండల శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ తగరపువలసలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై చేసిన ఆరోపణలను వారు ఖండించారు. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మండలానికి రూ.15 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఈ నిధులతో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని పంచాయతీల్లో కుళాయిల నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. మిగతా పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనంత పద్మనాభుని ఘాట్ రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయడానికి రూ.5 కోట్లు, పాండ్రంగి సమీపాన గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి రూ.16.50 కోట్లు, పద్మనాభం కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు రోడ్డు విస్తరణకు రూ.11 కోట్లు, రేవిడి నుంచి ఐనాడ వరకు రోడ్డు అభివృద్ధికి రూ.16 కోట్లు, అనంతుని గిరిపై ఆలయ శిఖరం పునర్నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు చేయించారని వారు తెలిపారు. కన్నయ్య కోనేరు నుంచి రెడ్డిపల్లి శాంతినికేతన్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అనంతుని ఘాట్ రోడ్డు బీటీ పనులు, పాండ్రంగి వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. పద్మనాభం, కృష్ణాపురం, బి.తాళ్లవలస గ్రామాల్లో వందేళ్ల నుంచి రైతులు భూమి సాగుచేస్తున్నప్పటికీ వీరికి ప్రభుత్వ పరంగా ఎటువంటి లబ్ధి చేకూరేది కాదన్నారు. ఈ గ్రామాల రైతులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి రైతు భరోసా ఇప్పించారన్నారు. నారా లోకేష్ కుటుంబం రెండెకరాలతో రాజకీయాల్లోకి వచ్చి కోట్లాది రూపాయలు సంపాదించిందని ఆరోపించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.కోట్లాది ఆస్తితో రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సెంటు భూమి కూడా ఆక్రమించలేదన్నారు. నారా లోకేష్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ , బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం, గాడు అప్పలరాజు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు పాల్గొన్నారు.




విశాఖ శారదా పీఠం వార్షికోత్సవాల్లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమారుడు శివ నందీష్

ఘనంగా మాతృభాషా దినోత్సవం



తెలుగుతల్లికి నివాళులు అర్పిస్తున్న ఆదర్శహిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు, విద్యార్థులు



బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో మాతృభాష ఆవశ్యకత గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు



కవుల వేషధారణలో విద్యార్థులు

తగరపువలస: మాతృభాష పరిరక్షణకు గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి పంతులు తదితర మహనీయులు ఎంతో కృషి చేశారని జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మాతృభాష గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పద్య పఠనం , కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు. భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృభాషను మరచిపోతే కన్న తల్లిదండ్రులను మరచినట్టేనని తెలిపారు.

పద్మనాభం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు కవుల వేషధారణలో అలరించారు. తెలుగు పద్యాలు పాడారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.గోవింద, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, సత్యనారాయణ, అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల భయం తొలగించేందుకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముందుగా ప్రశ్నపత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు, ఎస్‌టీయూ జిల్లా దేవుడుబాబు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మార్చిలో నిర్వహించే 10వ తరగతి పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు ఈ టెస్ట్ నిర్వహించినట్టు చెప్పారు. సుమారు 700మంది పరీక్ష రాయగా టాప్ 10లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీను, నాయకులు శేఖర్, భవానీ, నందిని పాల్గొన్నారు.

అపార్టుమెంట్‌లో చోరీ

- బంగారు ఆభరణాల అపహరణ

పీఎం పాలెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పార్టుమెంట్‌లో చోరీ జరిగింది. సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారుషెడ్ కూడలికి సమీపంలోని మధురవనం అపార్టుమెంట్‌లో సాఫ్ట్ వేర్ ఇంజినీరు స్వాతి అశోక్‌కు ఫ్లాట్ ఉంది. ఆమె బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె స్థానికంగా నివాసం ఉండనందున ఫ్లాట్ తాళాలు అపార్టులో నివశిస్తున్న సన్నిహితులకు ఇచ్చారు. ఫ్లాట్ శుభ్రపరిచే బాధ్యతను పనిమనిషికి అప్పగించారు.రెండు రోజులకు ఒకసారి పనిమనిషి శుభ్ర పరుస్తుంటుంది.ఈ క్రమంలో ఈ నెల 16న ఫ్లాట్‌లో పనిచేయడానికి పనిమనిషి వెళ్లగా ప్రధాన తలుపు తాళం కప్ప గొళ్లెం బద్దలుకొట్టి ఉంది. బెంగళూరు ఉంటున్న స్వాతికి సమాచారం అందించగా ఆమె బుధవారం వచ్చి చూశారు. ఇంట్లోని బీరువాలో భద్రపరచిన సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 452 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కృష్ణాకాలనీ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి, 452 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సహాయ వైద్యాధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్టు చెప్పారు. ఐదుగురు వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టులు రోగులు వైద్యసేవలందించారు. అందులో 200మంది మహిళలు, 242మంది పురుషులు, పిల్లలు 10మంది, గర్భిణులు ఆరుగురు పాల్గొన్నారు. 30 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన 20మందికి కళ్ల అద్దాలు అందజేశారు.

హల్ట్ ప్రైజ్ క్యాంపస్ ప్రోగ్రాంలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన హల్ట్ ప్రైజ్ క్యాంపస్ ప్రోగ్రాంలో ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. క్యాంపస్ స్థాయిలో కళాశాలకు చెందిన విద్యార్థినులు డి.రీష్మ, యు.దేవకి, బి.వింధ్య, జి.భవానిదేవిలు రైలు ప్రమాదాల నివారణ అనే అంశంపై తయారు చేసిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి లభించింది. రైలు ప్రమాదాలను నివారిస్తూ, ప్రజల ప్రాణాలను పరిరక్షించే దిశగా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి, ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.అరుణ, డాక్టర్ ఎస్.రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థం శ్రేయస్కరం



ఆచార్య దమ్మపాల గురూజీని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

ఏయూ క్యాంపస్: ప్రతి ఒక్కరూ నిస్వార్థపరత్వాన్ని అలవరుచుకోవాలని బౌద్ధ గురువు, నేపాల్‌లోని సెంటర్ ఫర్ రైట్ వ్యూ మెడిటేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య దమ్మపాల గురూజీ అన్నారు. బుధవారం ఏయూ తత్వశాస్త్ర విభాగాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సమాజంపై సరైన అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. బుద్ధుని చరిత్ర తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార్య వి.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానం

తగరపువలస: భీమిలి మండలంలోని గ్రామ సచివాలయాల వలంటీర్లకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం లక్ష్మీపురం పంచాయతీలో సేవా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అంతకు ముందు నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని భీమిలి మండలం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

తగరపువలస: చిట్టివలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు సోషల్, ఫిజిక్స్, మాథ్స్, బయాలజీ సబ్జెక్టులపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. సంతపేట జీవీఎంసీ అంబేడ్కర్ హైస్కూల్‌లో నిర్వహించనున్న ఈ శిక్షణ పొందగోరువారు 99491 49541, 93819 87074 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు గంటాన మోహనరావు కోరారు.

వైఎస్సార్‌సీపీ నేత అప్పారావుకు సన్మానం

పద్మనాభం: వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన రేవిడి గ్రామానికి చెందిన మరగడ అప్పారావును దుశ్శాలువాతో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు బుధవారం సన్మానించారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ మండల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదిబాబు, బోని సన్యాసినాయుడు, బూసురోతు అప్పారావు, తాలాడ పద్మనాభం, మాదిరెడ్డి భాస్కరరావు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు సమయపాలన పాటించాలి

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో ఆధార్ నమోదు, సవరణలకు కేటాయించిన సచివాలయాలు సమయపాలన పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు మంగళవారం సంతపేట సచివాలయానికి రాగా ఆధార్ నమోదు సిబ్బంది ఉదయం 11 గంటల వరకు రాలేదు. దీంతో సచివాలయ సిబ్బంది వీరిని మధ్యాహ్నం 2 గంటలకు రావాలని సూచించడంతో ఉసూరుమంటూ వెనుతిరిగారు. సమయపాలన పాటించేలా జోనల్ అధికారులు సంబంధిత సచివాలయాల ఆధార్ నమోదు సిబ్బందికి సూచనలు చేయాలని వీరు కోరుతున్నారు.

ఆదర్శనగర్‌లో ఆక్రమణలు తొలగించాలి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌లో ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరారు. ఈ రహదారిని ఆనుకుని నిర్మించిన ఇళ్ల నుంచి వాడుక, మురుగునీరు రోడ్లపైకి వదులుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మరిన్ని దుకాణాలు ఈ ఇరుకైన మార్గంలో ఏర్పాటు చేస్తున్నందున నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్‌బస్సులు, ఆటోలు ఈ మార్గంలో ఎదురెదురుగా వచ్చినప్పుడు ఆక్రమణల కారణంగా తప్పించుకోవడానికి వీలుకాక ఇబ్బందిగా ఉందని ఆదర్శనగర్ వాసులు తెలిపారు. ముఖ్యంగా శుభం అపార్ట్‌మెంట్ల వద్ద నుంచి తాతా థియేటర్ డౌన్ రోడ్డు వరకు ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరారు.

అప్పన్నకు భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం



స్వామివారికి యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు.

బోధన సామగ్రి వినియోగంపై స్టేట్ టీమ్ సంతృప్తి



విద్యార్థుల బోధన సామగ్రిని పరిశీలిస్తున్న ఎల్‌ఐపీ స్టేట్ టీమ్



సునీల్‌శర్మ కాలనీ జెడ్పీ స్కూల్లో ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న స్టేట్ టీమ్ సభ్యులు

మధురవాడ సునీల్ శర్మ కాలనీ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన బృందం

మధురవాడ: విద్యార్థులు రికార్డులు, బోధన సామగ్రి, నోట్ బుక్స్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ), వినియోగంపై స్టేట్ ఎల్‌ఐపీ టీమ్ సంతృప్తి వ్యక్తం చేసింది. బుధవారం సాయంత్రం మధురవాడ వాంబేకాలనీలోని సునీల్ శర్మకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం టీమ్ సందర్శించింది. బృందానికి నాయకత్వం వహిస్తున్న శ్రీకాకుళం డైట్ వైస్ ప్రిన్సిపాల్ భారతమ్మ, భీమిలి డైట్ ఆచార్యులు త్రినాథరావు తదితరులు పాఠశాలలో 6, 7, 8 తరగతులు చదువుతున్న పిల్లలతో మాట్లాడి పలు అంశాలు పరిశీలించారు. వివిధ సబ్జెక్టుల్లో బోధనా సామగ్రి వినియోగం, పఠనా శక్తి, బోధనా తీరు వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు విద్యార్థులపై మరింత చూపాలని, డీఈవో ఆదేశాలు మేరకు ఫిబ్రవరి 29లోపు అందరికీ చదవడం, రాయడం వచ్చేటట్లు, ఇతర అంశాల్లో వృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీలు జి.రామ్‌నాథ్, రాంబాబు, పాఠశాల హెచ్‌ఎమ్ గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు కొత్త టిప్పర్



నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో కొత్త టిప్పర్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు చెత్తను తరలించేందుకు కొత్త టిప్పర్‌ను సమకూర్చారు. రూ.60 లక్షల విలువైన ఈ టిప్పర్‌తో పాటు రూ.25 లక్షలతో స్వీపింగ్ మిషన్‌ను జీవీఎంసీ కొనుగోలు చేసింది. వీటిని త్వరలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభిస్తారు. ప్రస్తుతం నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి కాపులుప్పాడ జిందాల్ పవర్ ప్లాంట్‌కు చెత్తను తరలించేందుకు 8 టన్నుల సామర్థ్యం కలిగిన ఒక్క టిప్పరే ఉంది. ఈ డంపింగ్‌యార్డుకు ప్రతిరోజూ 35 టన్నుల వరకు చెత్త చేరుతుంది. దీంతో పాత టిప్పర్ ద్వారా రెండు నుంచి నాలుగు ట్రిప్పులు తరలించినా రోజూ ఎంతో కొంత చెత్త మిగిలిపోతోంది. కొత్తగా కొనుగోలు చేసిన టిప్పర్ సామర్థ్యం 20 టన్నులు. ఈ కొత్త వాహనంతో రెండు ట్రిప్పుల్లోనే నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి కాపులుప్పాడ జిందాల్ పవర్ ప్లాంట్‌కు పూర్తి స్థాయిలో చెత్తను తరలించవచ్చు. నమ్మివానిపేటలో నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పూర్తయితే చెత్త తరలింపునకు క్లోజ్‌డ్ కంపాక్ట్ వాహనాలను కూడా వినియోగిస్తారు. దీంతో నమ్మివానిపేట డంపింగ్‌యార్డు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దుర్గంధ సమస్యతో పాటు పొగ సమస్య కూడా పరిష్కారం కానుంది.

అథ్లెటిక్స్‌లో సత్తా చూపిన రాంబాబుకు సన్మానం



రాంబాబును సన్మానిస్తున్న పెద ఎర్నాయుడు

పద్మనాభం: పూణేలో జరిగిన నేషనల్ అథ్లెటిక్ పోటీల్లో రెండు సిల్వర్, ఒక కాంస్య పతకం సాధించిన అనంతవరం గ్రామానికి చెందిన సింహాచలం ఆర్టీసీ డిపో కండక్టర్ కె.రాంబాబును వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రిపాటి పెద ఎర్నాయుడు బుధవారం దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రూ.10వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గేదెల చంద్రరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.వి.కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

పనులు తక్షణం పూర్తి చేయాలి

- సచివాలయాలను సందర్శించిన ఏసీపీ, ప్రత్యేక అధికారి శాస్త్రి



సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌పై ఆరా తీస్తున్న శబ్‌నాన్ శాస్త్రి

మధురవాడ: ప్రభుత్వం అంత్యంత ప్రాధాన్యంగా భావిస్తున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, హెల్త్ కార్డులు పంపిణీని శత శాతం పూర్తి చేసేందుకు అంతా కృషి చేయాలని జీవీఎంసీ 5వ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి, జోన్-2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శబ్‌నాన్‌శాస్త్రి చెప్పారు. బుధవారం ఆయన వార్డులోని బొట్టవాని పాలెం చెరువు వద్ద ఉన్న 70, 71, సాయిరాంకాలనీలోని 37వ వార్డు సచివాలయంతో పాటు ఇతర సచివాలయాలను సందర్శించారు. సెక్రటరీలు పనితీరుపై పలు సూచనలు చేశారు. ఇక్కడ సెంటు స్థలం ఇళ్ల రిజిస్ట్రేషన్ల, హెల్త్ కార్డులు పంపిణీతో పాటు ఇతర పౌర సేవలు తీరును పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ 80శాతం జరిగిందని, మిగిలిన పనులు కూడా తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

23 సిమెంట్ బెంచీల ఏర్పాటు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన బెంచీవద్ద సభ్యులు

భీమునిపట్నం: మండల కేంద్రం భీమిలిలోని పలు ప్రాంతాల్లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి(ఫ్యాబ్) ఆధ్వర్యంలో బుధవారం 23 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సన్‌స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, విశ్రాంత బీఎస్ఎఫ్ కమాండెంట్ కలిగొట్ల బాబ్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాబ్ సభ్యులు ఎన్నో మంచి పనులు చేస్తున్నారని చెప్పారు. తాము చదువుకున్న కళాశాలలో కూడా బెంచీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫ్యాబ్ ప్రతినిధి ఎం.సూర్యశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రాంతాల్లో బెంచీలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సన్నీ కాళ్ల, గుగ్గిళ్ల పార్వతీశం, డాక్టర్ కాళ్ల లావణ్య, పి.దేవానంద్ పాల్గొన్నారు.